# COMMUNIST PARTY OF INDIA (MARXIST)

## ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


**ప్రచురణార్ధం/ప్రసారార్ధం :** **విజయవాడ,**

**తేది : 31 డిశంబరు, 2022.**

**పెన్షన్లు, అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలలో కోతలు ఆపాలి.**
**జగనన్న ఇళ్ళ నిర్మాణానికి రు.5 లక్షలు ఇవ్వాలి.**
**రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు**

సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం నిన్న (ది.30.12.2022) కా॥ వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. పోలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు గారు హాజరయ్యారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి చేసిన తీర్మానాలను తెలియజేస్తున్నాము. రాష్ట్ర ప్రజలందరికీ సిపిఐ(యం) రాష్ట్ర కమిటి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నది.

సంక్షేమ పథకాల కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు ప్రభుత్వం నుండి నిరాశే ఎదురవుతున్నది. సంక్షేమ పథకాలు, నవరత్నాల క్రింద పంపిణీ చేస్తున్న సహాయంలో కోత వల్ల ప్రజలకు అందాల్సిన పూర్తి ప్రయోజనాలు అందడం లేదు. వయోవృద్ధులు, వితంతువులకు ఆదరువుగా ఉన్న పెన్షన్లలో కూడా కోతలు పెడుతున్నారు. పింఛనుదారుల పేర్లతో ఆస్థులు ఉన్నట్లు తప్పుడు రికార్డులు చూపించడం, సెంటు, సెంటున్నర ఉన్న భూములను కూడా విస్తీర్ణం పెంచి నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. 300 యూనిట్ల కరెంటు వాడకం ఉంటే పెన్షన్ ఇవ్వబోమని అంటున్నారు. కుటుంబంలో ఒకరు ఏదో ఒక లబ్ధి పొందుతున్నారని వికలాంగులకు పెన్షన్ కోత పెట్టడం అన్యాయం. ప్రభుత్వాన్ని విమర్శించారని, ఓటు వేయలేదని, మరొక పార్టీకి చెందిన వారనీ కక్ష సాధింపులతో వేధించడానికి పెన్షన్లు, సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని బెదిరించడం పరిపాటిగా మారింది. అమ్మఒడి లబ్ధిదారులకు కూడా షరతులు పెట్టి 3.5 లక్షల మందికి కోత విధించారు. ట్యాబ్‌ల పంపిణీ పేరుతో మరో 5 లక్షల మందిని తగ్గిస్తున్నారు. అమ్మఒడి డబ్బులతో ట్యాబ్‌లు కొని కంపెనీలకు ప్రజాధనాన్ని కట్టబెడుతున్నారు. వీటన్నింటివల్ల రానున్న కాలంలో సంక్షేమానికి పెద్ద దెబ్బ తగులుతుందని సిపిఐ(యం) హెచ్చరిస్తున్నది.

**రేషన్ డిపోలలో సంక్రాంతి సందర్భంగా బియ్యంతోపాటు పండుగ సరుకులు పంపిణీ చేయాలి**

రేషన్ సరఫరా కూడా అగమ్య గోచరంగా మారింది. కరోనా సమయం నుండి కేంద్రం ఇచ్చే ఉచిత బియ్యంలో కూడా మోడీ ప్రభుత్వం కోతలు పెట్టడం దారుణం. గతంలో లాగే సంక్రాంతి, ఇతర పండుగల సందర్భంగా ఇచ్చే సరుకుల కిట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నాము. పెన్షన్లు, ప్రజాపంపిణీ, సంక్షేమ పథకాల సమస్యలపై సిపిఐ(యం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 2వ వారంలో సచివాలయాల వద్ద రాయబారాలు, ధర్నాలు నిర్వహిస్తాము. ప్రభుత్వ దృష్టికి సమస్యల తీవ్రతను తీసుకెళ్తాము.

నవంబరు 27నే ప్రారంభిస్తామన్న జగనన్న ఇళ్ళ పరిస్థితి అతీగతీ లేకుండా పోయింది. ఇల్లు కట్టడం పూర్తయితే తమకంటూ ఉండడానికి ఒక జాగా ఉంటుందని ఆశగా ఎదురు చూస్తున్న ప్రజలకు ఎటువంటి ఫలితం దక్కలేదు. నిర్మాణాలకు ఇవ్వాల్సిన నిధులు సక్రమంగా అందడం లేదు. ఇంటి నిర్మాణానికి 1.80 వేలు ఎటూ సరిపోవు. 5 లక్షలు మంజూరు చేస్తే తప్ప ఇల్లు పూర్తయ్యే పరిస్థితి లేదు. పరిశ్రమల పేరుతో లక్షల ఎకరాలు తీసుకుని దుర్వినియోగం చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం పేదలను

మాత్రం ఇల్లు కట్టుకోకపోతే ఇచ్చిన స్థలం వెనక్కు తీసేసుకుంటామని బెదిరించడం ఏ రకంగా న్యాయమని సిపిఐ(యం) ప్రశ్నిస్తున్నది. పార్టీ ఆధ్వర్యంలో జగనన్న కాలనీలకు వెళ్ళి పరిశీలన చేసి వాస్తవాలను వెల్లడించే కార్యక్రమం చేపట్టనున్నది.

**ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళించకుండా దళిత వాడల అభివృద్ధికే ఖర్చుచేయాలి**
**సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలి**

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం గడువు తీరనున్నది కనుక దాని గడువును పెంచాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నది. నోడల్ ఏజెన్సీలద్వారా సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా ఖర్చుయ్యేలా చర్యలు తీసుకోవాలి. దళితుల సంక్షేమానికి వాడవలసిన నిధులను ఉమ్మడి పథకాలకు మళ్ళించడాన్ని విమర్శిస్తున్నది. సబ్‌ప్లాన్ నిధుల్లో కేవలం 58% మాత్రమే ఖర్చుయ్యాయి. ఇప్పటికి ఇంకా సరైన త్రాగునీరు, రోడ్లకు కూడా నోచుకోని దళిత వాడలు, గిరిజన గ్రామాలు చాలా ఉన్నాయి. ఇతర ప్రాంతాలతో సమానంగా దళిత వాడలు, ఏజెన్సీ ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందే వరకు సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలని, సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేసి దళితుల సంక్షేమ పథకాలకే ఖర్చు చేయాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నది. అన్ని దళిత, ప్రజా సంఘాలను భాగస్వాములుగా చేసి సబ్‌ప్లాన్ చట్టం పటిష్టంగా అమలయ్యేలా, నిధులు మంజూరు, ఖర్చు సక్రమంగా జరిగేలా ప్రణాళికలు రూపొందించాలి. సబ్‌ప్లాన్ కొనసాగింపు కోసం సాగే ఆందోళనకు సిపిఐ(యం) పూర్తి మద్ధతు ప్రకటిస్తున్నది.

సంక్షేమ పథకాలకు కేటాయించాల్సిన నిధులు నిర్దిష్టంగా ఆయా పథకాలకే కేటాయించాలని, నవరత్నాలకు మళ్ళించరాదని డిమాండ్ చేస్తున్నది.

**(వి.శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి